సాక్షి
ములుగు

శుక్రవారం । 3 । మే । 2024



స్కిల్ డెవలప్‌మెంట్ @ఐటీఐ
ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లకు మంచి రోజులు రానున్నాయి. ఐటీఐలన్నీ ఇకపై స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలుగా మారనున్నాయి.
- IIలో▸



రైతుల అవసరాలు తీర్చే ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం
రైతుల వ్యవసాయ అవసరాలు తీర్చడానికి ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసినట్లు నాబార్డు సీజీఎం మణికుమార్ తెలిపారు.
- IIలో▸

గరిష్టం/కనిష్టం
$44^0 / 28^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. సాయంత్రం తర్వాత సాధారణ పరిస్థితి ఉంటుంది.

న్యూస్‌రీల్

వాహనాల తనిఖీ



వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు వద్ద జాతీయ రహదారిపై పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు అందులోని బ్యాగులు, లగేజీని పరిశీలించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న వాహనాలతో పాటు తెలంగాణ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తున్న వాహనాలను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. ప్రయాణికులు వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు కొత్త వ్యక్తులు, అపరిచితులు, అనుమానితులు తారస పడితే సమాచారం ఇవ్వాలని వాహన దారులను ఆదేశించారు. నగదు తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించారు.

హేమాచలుడి సన్నిధిలో దోపిడీ

- పూజా సామగ్రి, నాభిచందనానికి రూ.వేలల్లో వసూళ్లు

మంగపేట: రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధి గాంచిన మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులను కొందరు ఆలయ సిబ్బంది నిలువు దోపిడీకి పాల్పడుతున్న తీరు గురువారం వెలుగులోకి వచ్చింది. ఆలయంలో స్వామివారి తిలతైలాభిషేకం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల నుంచి పూజా సామగ్రి కోసం రూ.వేలల్లో వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. ఏప్రిల్ 20వ తేదీన కొందరు భక్తులు తిలతైలాభిషేకం పూజలు చేసేందుకు కావాల్సిన పూజా సామగ్రి కోసం ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో ఒకరిని సంప్రదించగా పలువురి వద్ద నుంచి సుమారు రూ.5,600 వసూలు చేసినట్లు గుర్తించిన మరికొందరు ఈ విషయాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన వ్యక్తిని అక్కడ నుంచి పంపించి విషయాన్ని బయటకు రాకుండా జాగ్రత పడినట్లు సమాచారం. ఆలయంలో ప్రతి శని, ఆదివారం ఆలయంలో నిర్వహించే తిలతైలాభిషేకం, సంతానం కోసం ఇచ్చే నాభిచందన ప్రసాదం కొరకు వచ్చే భక్తుల నమ్మకాన్ని ఆసరా చేసుకుని వేలాది రూపాయలు వసూలు చేయడం సరికాదని పలువురు భక్తులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దోపిడీదారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై కార్యనిర్వాహణ అధికారి సత్యనారాయణనను వివరణ అడిగేందుకు ఫోన్లో సంప్రదించగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది.

పొరపాట్లు జరగకుండా చూసుకోవాలి



మహబూబాబాద్: మానుకోట పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని ఆర్వో, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం మొదటి సప్లిమెంటరీ ఈవీఎంల ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈసందర్భంగా అద్వైత్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ.. మానుకోట పార్లమెంట్ పరిధిలోని డోర్నకల్, మానుకోట అసెంబ్లీ నియోజకవర్గాలకు మొదటి ర్యాండమైజేషన్‌లోనే 760 బ్యాలెట్ యూనిట్లను కేటాయించామని తెలిపారు. సమావేశంలో జనరల్ అబ్జర్వర్ రచిత్‌రాజ్, నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థుల ఖర్చుల రిజిస్టర్ల పరిశీలన

మహబూబాబాద్: మానుకోట లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఖర్చుల రిజిస్టర్లను పరిశీలనకు తీసుకురావాలని ఆర్వో, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థుల వ్యయ వివరాలను ఈ నెల 3న మొదటిసారి వ్యయపరిశీలకులు ఉమాకాంత్ ధ్రుపాటి పరిశీలిస్తారని తెలిపారు. అలాగే 7న, 11వ తేదీన సైతం పరిశీలించనున్నట్లు చెప్పారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు వ్యయ పరిశీలకులు అందుబాటులో ఉంటారన్నారు. అభ్యర్థులు లేదా వారి తరఫున ఏజెంట్లు వ్యయ రిజిస్టర్లతో హాజరుకావాలన్నారు. హాజరుకాని పక్షంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకుంటామన్నారు.

నిర్మాణాలపై నిర్లక్ష్యం

జిల్లాలో 86 మేకలు, 144 గేదెల షెడ్లు మంజూరు
- అవగాహన కల్పించని ఉపాధి హామీ అధికారులు
- దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్న రైతులు



పునాదికే పరిమితమైన మేకల షెడ్డు

ఏటూరునాగారం : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉచితంగా మేకలు, గేదెల షెడ్లను నిర్మించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఏడాది కొత్త పథకానికి శ్రీకారం చుట్టాయి. ఈ క్రమంలో అధికారులు జిల్లాలోని మండలాలు, గ్రామ పంచాయతీల వారీగా షెడ్ల నిర్మాణానికి దరఖాస్తులను స్వీకరించారు. గేదెల షెడ్లు 144 మంజూరు చేయగా ఇప్పటి వరకు 37 షెడ్ల నిర్మాణ పనులు మాత్రమే కొనసాగుతున్నాయి. అలాగే, మేకల షెడ్లు 86 మంజూరు కాగా 13 వివిధ నిర్మాణాల దశల్లోనే ఉన్నాయి. మరికొన్ని పునాదులకే పరిమితం అయ్యాయి. ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఏపీడీ, ఏపీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నప్పటికీ మేకలు, గేదెల షెడ్ల నిర్మాణాలపై దృష్టి సారించకపోవడంతోనే పనులు ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. అదే విధంగా ఈజీఎస్‌లో కొబ్బరి మొక్కల పెంపకం, వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ లాంటి పనులకు అవకాశం ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వాల లక్ష్యం నీరుగారిపోతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కేవలం కూలీల పనులే..
కేవలం వంద రోజుల కూలీలతో ఉపాధి హామీ కింద చెరువుల్లో తవ్వకాలు, పర్కులేషన్ ట్యాంకులు, ఫీడర్ చానల్, చెరువు నుంచి ఫీల్డ్ చానల్, పంట పొలాలకు లింకు రోడ్ల నిర్మాణాలను మాత్రమే చేపడుతున్నారు. వంద రోజుల పనులకు కూడా ఆసక్తిగా కూలీలు ఎవరు రావడం లేదని తెలుస్తోంది. ఈజీఎస్ ద్వారా నగదు ఆలస్యంగా రావడం, ప్రైవేట్‌గా రైతుల పొలాల వద్ద పనులు చేస్తే అదే రోజు డబ్బులు వస్తుండడంతో అటువైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

ఊసేలేని కొబ్బరి మొక్కల పెంపకం
ఉద్యాన విభాగం కింద ప్లాంటేషన్ కోసం ఒక్కో రైతుకు ఉచితంగా 40 కొబ్బరి మొక్కలను ఇచ్చి వాటిని నాలుగేళ్ల పాటు పెంచడం, దానికి కావాల్సిన ఖర్చులను ఈజీఎస్ ద్వారా అందించే అవకాశం ఉంది. కానీ, ఈ పథకం అమలుకు నోచుకోవడం లేదు. ఇలా అనేక పథకాల ఉన్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల జాబ్‌కార్డు దారులు, రైతులు ఉపయోగించుకోలేని దుస్థితి నెలకొంది.

వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీ నిల్
ఈజీఎస్, గ్రామ పంచాయతీ సంయుక్తంగా చేపట్టాల్సిన వర్మీ కంపోస్ట్ తయారీ అటకెక్కింది. గ్రామ పంచాయతీ వార్డుల వారీగా తడి, పొడి చెత్తను వేరు వేరుగా చేసి షెడ్డు వద్ద నిర్మించిన వర్మీ కంపోస్ట్ గదుల్లో వానపాములు, మట్టి, ఆవు పేడతో ఎరువు తయారు చేయాల్సి ఉంది. అంతేకాకుండా వంటింట్లోని కూరగాయలు, ఇతర పండ్ల వ్యర్థాలతో ఈ ఎరువు తయారు చేయాల్సి ఉంది. కానీ ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో రైతులకు వర్మీ కంపోస్టు అందడం లేదు.

జిల్లాలోని గేదెలు, మేకల షెడ్ల మంజూరు వివరాలు

	గేదెలు షెడ్లు మంజూరైనవి	నిర్మాణంలో ఉన్నవి	మేకలషెడ్లు మంజూరైనవి	నిర్మాణంలో ఉన్నవి
ఏటూరునాగారం	13	1	6	0
గోవిందరావుపేట	8	8	1	1
కన్నాయిగూడెం	0	0	14	1
మంగపేట	24	1	18	0
ములుగు	53	21	36	9
తాడ్వాయి	0	0	1	0
వెంకటాపురం(ఎం)	10	3	10	2
వెంకటాపురం(కె)	0	0	0	0
వాజేడు	6	3	0	0

ఏడాదిగా ఎదురుచూస్తున్నా..



మేకల షెడ్డు కావాలని ఈజీఎస్ సిబ్బందికి దరఖాస్తు చేసుకొని ఏడాదిగా ఎదురు చూస్తున్నా. ఇంత వరకు ఎలాంటి నిధులు మంజూరు రాలేదు. వెంటనే అధికారులు షెడ్డు మంజూరు చేయాలి. మేకలను గతంలో ప్రభుత్వమే ఇచ్చింది. ఈ షెడ్డు కూడా ఇస్తే బాగుంటుంది.
-జాడి రాజు, రైతు, ఏటూరునాగారం

మంజూరు ఇచ్చాం.. నిర్మాణాలు కాలేదు..
జిల్లాలో మేకల షెడ్లు కొన్ని మంజూరు ఇచ్చాం. కానీ ఇంకా నిర్మాణాలు చేపట్టలేదు. ముందుగా లబ్ధిదారులు నిర్మాణం చేపట్టిన తర్వాత ఈజీఎస్ ద్వారా బిల్లులు చెల్లిస్తాం. రైతులు ఆసక్తి చూపి మేకలు, గేదెల షెడ్లు నిర్మించుకోవాలి. ఆ తర్వాత బిల్లులు ఇస్తాం.
- వెంకటనారాయణ, ఏపీడీ, ఎన్ఆర్ఈజీఎస్

బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



విద్యార్థికి ప్రశంస పత్రాన్ని అందిస్తున్న కలెక్టర్

కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: జిల్లాకు కొత్తగా వచ్చిన 200 బ్యాలెట్ యూనిట్లను సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ర్యాండమైజేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహబూబాబాద్ పార్లమెంట్‌లో 23మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. వీటికి రెండు బ్యాలెట్ యూనిట్లు అవసరం అవుతాయన్నారు. పోలింగ్ సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తినా ఓటింగ్‌కు అంతరాయం కలగకూడదనే ఉద్దేశ్యంతో అదనపు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లను కేటాయిస్తున్నట్లు వివరించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, తహసీల్దార్ రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి
విద్యార్థులు లక్ష్యంతో చదవుతూ ముందుకు సాగాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రశంస పత్రాలు, అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ శ్రీజ, ఎస్పీ డాక్టర్ శబరీశ్‌తో పాటు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల కృషిని అభినందించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర ఫలితాల్లో రాష్ట్రంలో రెండో ర్యాంక్ సాధించిన టీఎస్ఆర్‌జేసీ విద్యార్థి చరణ్‌తేజ, రెండో సంవత్సర ఫలితాల్లో జిల్లా మొదటి స్థానంలో నిలిచిన ఆకుల ఆకాష్, కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంకు చెందిన కావిరి రజినీకాంత్ ఏటూరునాగారంలో కళాశాలలో హెచ్ఈసీ చదివి మొదటి స్థానంలో నిలిచాడు.. వీరితో పాటు మరో 12 మందిని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్ ప్రశంస పత్రాలను అందించారు. వీరితో పాటు పదో తరగతి ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించిన 11 మంది విద్యార్థులకు మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, డీఈఓ పాణిని, జిల్లా మైనార్టీ శాఖ అధికారి ప్రేమలత పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌కు 14రూట్లు

ములుగు: జిల్లాలో ఫాం డీ ద్వారా హోం ఓటింగ్ వేయనున్న 77మంది తమతమ ఓటు హక్కును వినియోగించుకునేలా 14 రూట్లను ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి , ఏటూరునాగారం ఏటీడీఏ పీఓ చిత్రామిశ్రా అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం జిల్లా కేంద్రంలో హోం ఓటింగ్, ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ నిర్వహణపై సెక్టోరల్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రామిశ్రా మాట్లాడుతూ ఫెసిలిటేషన్ సెంటర్‌లో 2,470 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. హోం ఓటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రక్రియ మొత్తం వీడియో చిత్రీకరణ ఉంటుందన్నారు. రహస్య పద్ధతిలో ఓటింగ్ ఉంటుందని తెలిపారు. ఎలాంటి తప్పులు జరిగినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఫాం 13ఏ, 13బీ, 13సీలలో పోస్టల్ బ్యాలెట్ పేపర్ సీరియల్ నంబర్, అసిస్టెంట్ సంతకంతో పాటు వివరాలను సరైన విధంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి శ్రీపాల్, తహసీల్దార్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

హేమాచలుడి జాతర వేలం పాటలు



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

మంగపేట: మండలంలోని మల్లూరు గుట్టపై శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి 28 వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలు(జాతర) వేలం పాటలను ఆలయ ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో గురువారం నిర్వహించారు. జాతర సందర్భంగా ఈనెల 5నుంచి జూన్ 4వ తేదీ వరకు నెల రోజుల పాటు ఆలయ ప్రాంగణం పరిధిలో లడ్డు, పులిహోర ప్రసాదాలు తయారుచేసి విక్రయించుట, కొబ్బరి ముక్కలు పోగు చేసుకోవడంతో పాటు తదితర షాపుల నిర్వహణకు అనుమతి పొందేందుకు గురువారం వేలం పాటలు నిర్వహించారు. లడ్డు, పులిహోర ప్రసాదం విక్రయాలకు మల్లూరు చెందిన మారబోయిన గోవర్ధన్ రూ 3.18లక్షలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు జి. శ్రీకాంత్ రూ 55వేలు, పూల డెకరేషన్ డి. శ్రీనివాస్, తడుకల పందిళ్లు వేయుటకు సదానందం, రంగుల వేసేందుకు శ్రీనివాస్ రూ.57వేలకు టెండర్ బాక్స్ ద్వారా దక్కించుకున్నారు. కొబ్బరి కాయల విక్రయం, పుట్టు వెంట్రుకలు, ఫొటోలు తీసుకునేందుకు, చెప్పుల స్టాండ్ నిర్వహణకు ఈ నెల 8న వేలం పాటలను నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారయణ తెలిపారు.

ఆలయ కార్యనిర్వహణ ఇన్‌చార్జ్‌గా మహేష్
హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కార్యనిర్వహణ ఇన్‌చార్జ్ అధికారిగా రేగొండ మండలంలోని కొడవటంచ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్.మహేష్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుత ఆలయ కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ అనారోగ్య కారణాలతో రెండు నెలలు సెలవులో వెళ్తుండడంతో మహేష్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించినట్లు ఆయన తెలిపారు.

సీ విజిల్ యాప్‌పై అవగాహన కల్పించాలి

డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్‌వ్యాస్



వీసీకి హాజరైన కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎస్పీ

ములుగు: సీ విజిల్ యాప్‌పై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్‌వ్యాస్ సూచించారు. ఈ మేరకు లోక్‌సభ ఎన్నికలపై న్యూఢిల్లీ నుంచి పోలింగ్ నిర్వహణ, సన్నద్ధతపై గురువారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌కు హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, జిల్లా తరఫున కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీలో నితేష్‌వ్యాస్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల విధులను ప్రతిఒక్కరూ నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పక్కాగా ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఈవీఎం బ్యాలెట్ యూనిట్లు, ఎఫ్ఎల్‌సీ, ర్యాండమైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. మద్యం, డబ్బు పంపిణీ జరగకుండా పక్కాగా నిఘా పెట్టాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 55శాతం ఓటరు స్లిప్పులు పంపిణీ చేశామన్నారు. 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులపై అప్రమత్తంగా ఉంటున్నామని వివరించారు. ఎస్పీ డాక్టర్ శబరీశ్ మాట్లాడుతూ పోలీసు శాఖ తరఫున కట్టుదిట్టమైన భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎంల తరలింపు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల వద్ద బందోబస్తు చేపడుతున్నామని వివరించారు.

బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఓంకార్

వెంకటాపురం(ఎం): బాల్య వివాహాలను అరికట్టేందుకు పంచాయతీ కార్యదర్శులు గ్రామస్థాయిలో బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక అధికారులైన పంచాయతీ కార్యదర్శులకు వివాహాల నమోదు చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టంపై సెన్సిటైజేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ రాజు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్ హాజరై మాట్లాడారు. గ్రామ పరిధిలో సీఎంపీఓలుగా ఉండే పంచాయతీ అధికారులు ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్న సమాచారం తెలిసిన వెంటనే ఆపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా క్షేత్రస్థాయిలో నిర్వహించేందుకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సునీత, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, డీసీపీయూ అధికారి బండారి జ్యోతి, ఆయా పంచాయతీల కార్యదర్శులు, ఫీల్డ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

ప్రచార జోరు



ప్రధాన పార్టీల నేతల సందడి
- పోటాపోటీగా సభలు, రోడ్డుషోలు
- తొర్రూరులో బల నిరూపణకు ఆరాటం

సాక్షి, మహబూబాబాద్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాకు జాతీయ, రాష్ట్రస్థాయి ముఖ్య నేతల రాకతో అన్ని పార్టీల్లో సందడి నెలకొంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సభలు నిర్వహించగా.. బుధవారం మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షోలో పాల్గొన్ని శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. ఇలా ప్రధాన పార్టీలు ప్రచారంలో వేగం పెంచాయి.

తొర్రూరే కీలకంగా..
వరంగల్ పార్లమెంట్ పరిధిలోని తొర్రూరు, పెద్దవంగర మండలాలను టార్గెట్‌గా చేసుకొని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటా పోటీగా ప్రచారం చేస్తున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఓటమి షాక్ నుంచి తేరుకోకముందే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో తన సత్తా చాటేందుకు అనుభవాన్ని రంగరించి ప్రచారం చేస్తున్నారు. పాత క్యాడర్‌ను కూడగట్టడం, కార్యకర్తల్లో మనోధైర్యం నింపి ప్రభుత్వ వైఫల్యాలే ఆయుధంగా ప్రచారం చేస్తున్నారు. తొర్రూరు మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్‌కు మెజార్టీ తెచ్చి తీరుతానని తన అనుచరులతో చెబుతున్నారు. ఇక ఎర్రబెల్లిపై గెలిచిన ఉత్సాహంతో ఉన్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కూడా తనదైన శైలిలో ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. కడియం కావ్యను గెలిపించడమే కాదని.. మరోసారి పాలకుర్తిలో కాంగ్రెస్‌దే పైచేయి అని నిరూపిస్తామని ఆమె చెబుతున్నారు. యువతను ఉత్తేజపరిచే విధంగా ప్రచారం చేయడంతోపాటు.. సమస్యలు పరిష్కరిస్తానని సభనుంచే సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడటం సోషల్ మీడియాలో హాట్‌టాఫిక్‌గా మారింది.

నేతల తాకిడి..
పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమైన మహబూబాబాద్‌కు అన్ని పార్టీల నుంచి పెద్ద నాయకుల తాకిడి పెరిగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్‌టీఆర్ స్టేడియంలో సభ పెట్టి కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపారు. అదేవిధంగా అభ్యర్థి బలరాంనాయక్ గెలుపు బాధ్యత ఎమ్మెల్యేలపై మోపి భారీ మెజార్టీ సాధించాలని టార్గెట్ పెట్టారు. దీంతో అభ్యర్థి కంటే.. ఎమ్మెల్యేలు కీలకంగా మారారు. అలాగే బీజేపీ అభ్యర్థి సీతారంనాయక్‌ను గెలిపించడమే ధ్యేయంగా ఇటీవల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరయ్యారు. రాష్ట్రంలోని అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను, గతంలో పరిపాలించిన బీఆర్ఎస్‌ను తీవ్రస్థాయిలో విమర్శించారు. బీజేపీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపారు. ఇక శాసన సభ ఎన్నికల్లో ఓటమిని చవిచూసిన బీఆర్ఎస్ నాయకులు ప్రస్తుతం చావో..రేవో అన్నట్లు ప్రచారం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం జిల్లా నుంచి ఖమ్మం వెళ్తుండగా మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ వద్ద కాసేపు ఆగి తనదైన శైలిలో ప్రచారం చేశారు. రైతులు, మహిళలతో మాట్లాడిన కేసీఆర్ ఉద్యమ కాలం నాటి కేసీఆర్‌ను గుర్తు చేశారు. అదేవిధంగా బుధవారం మహబూబాబాద్‌లో రోడ్డుషో పాల్గొని శ్రేణుల్లో మనోధైర్యం నింపారు.

16లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

భూపాలపల్లి అర్బన్: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫీజు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 16వ తేదీలోగా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చెల్లించాలని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి ఎస్.రాంకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.50 అపరాధ రుసుముతో జూన్ 1వ తేదీలోగా చెల్లించవచ్చని తెలిపారు. పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఫెయిల్ అయిన విద్యార్థులు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలు హాజరు కావాలని కోరారు. రీ కౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.1000తో బ్యాంక్ చలాన తీసి మెమో, హాల్‌టికెట్ జత చేసి ప్రధానోపాధ్యాయుల సంతకంతో కూడిన అప్లికేషన్‌ను 15వ తేదీలోపు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

వినియోగదారులకు నిరంతర విద్యుత్

ఎస్ఈ మల్చూర్



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఈ మల్చూర్

ములుగు/ములుగు రూరల్: విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించాలని విద్యుత్‌శాఖ భూపాలపల్లి ఎస్ఈ మల్చూర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో విద్యుత్ ఉద్యోగుల భద్రతా వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశిందేవిపేట సబ్ స్టేషన్ పరిధిలో వ్యవసాయ వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా కోసం వదులుగా ఉన్న విద్యుత్ లైన్ల మరమ్మతులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. సబ్ స్టేషన్ పరిధిలో వదలుగా ఉన్న విద్యుత్ లైన్ల సవరణకు 834 పోల్స్ వేసినట్లు తెలిపారు. 116 వంగి పోయిన పోళ్లను సరి చేసినట్లు తెలిపారు. ములుగు పట్టణ పరిధిలో 33/11 కేవీకి సంబంధించి కొత్తగా 6-63 కిలోవాట్స్, 2-100 కిలో వాట్స్ టాన్స్‌ఫార్మర్లను అమర్చినట్లు తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు అందుబాటులో ఉండి వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించేందుకు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు డివిజన్ ఇంజనీర్ నాగేశ్వర్‌రావు, ఏడీఈ వేణుగోపాల్, ఏఈ సాయికృష్ణ, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ
వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ మల్చూర్, జిల్లా డివిజనల్ ఇంజనీర్ పుల్సం నాగేశ్వర్‌రావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 11 కేవీ నర్సాపూర్ బ్రేకర్, వెల్తుర్లపల్లి సబ్‌స్టేషన్‌లో డబుల్ ఎర్తింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నిరంతరంగా అందిస్తున్న విద్యుత్ సరఫరాపై ఆరా తీశారు. విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి వినియోగదారులకు నిరంతర సేవలు అందించాలని, ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగవద్దని సూచించారు. అనంతరం విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ వేణు, గోపాల్‌స్వామిరెడ్డి, ఏఈ సురేష్, సబ్ ఇంజనీర్ రాజు, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు ముగ్గురు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్లు ప్రారంభం



నల్లగొండ: వరంగల్‌– ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు గురువారం తొలిరోజు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు ఒక సెట్‌ నామినేషన్‌ దాఖలు చేయగా, ప్రజావాణి పార్టీ తరఫున పాటి శ్రీకాంత్‌ రెడ్డి ఒక సెట్‌, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య ఒక సెట్‌ నామినేషన్‌ వేశారు. మొత్తం ముగ్గురు అభ్యర్థులు మూడు సెట్ల నామినేషన్లు సమర్పించినట్లు జిల్లా కలెక్టర్‌, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి హరిచందన తెలిపారు.

పసుపు ధర క్వింటా రూ.15 వేలు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పసుపు(కాడిరకం)కు రికార్డు ధర క్వింటాకు రూ.15,165 పలికింది. మార్కెట్‌లో ఇటీవల పసుపు సీజన్‌ ప్రారంభం కాగా, ఇప్పటి వరకు క్వింటాకు గరిష్ట ధర రూ.12 వేల నుంచి రూ.14వేల వరకు పలికింది. ఈ క్రమంలో గురువారం మార్కెట్‌కు 69 బస్తాల పసుపు అమ్మకానికి రాగా, కాడిరకానికి గరిష్ట ధర రూ.15,165, కనిష్ట ధర రూ.14,529 పలుకగా, గోళా రకానికి గరిష్ట ధర రూ.14,801, కనిష్ట ధర రూ.14,800 పలికినట్లు మార్కెట్‌ అధికారులు తెలిపారు.

స్కిల్‌ డెవలప్‌మెంట్‌ @ ఐటీఐ

ప్రభుత్వ ఐటీఐలకు మహర్దశ
- ఆధునిక కోర్సుల దిశగా అడుగులు..
- ఉమ్మడి జిల్లాలో ఆరు ఐటీఐల ఎంపిక

కాజీపేట: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లకు భవిష్యత్‌లో మంచి రోజులు రానున్నాయి. ఐటీఐలన్నీ ఇకపై స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కేంద్రాలుగా మారనున్నాయి. ఐటీఐల్లో ప్రస్తుతం అందిస్తున్న సంప్రదాయ కోర్సులకు భిన్నంగా ఆధునిక సాంకేతిక కోర్సులను ప్రవేశ పెట్టి అమలు చేయడానికి ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల అయ్యాయి. ఇందు కోసం తెలంగాణ ప్రభుత్వం టాటా టెక్నాలజీస్‌ లిమిటెడ్‌ (టీటీఎల్‌)తో ఒప్పందం కుదుర్చుకుంది. యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా ఆధునిక కోర్సుల్లో శిక్షణ ఇవ్వడానికి కావాల్సిన వనరులను సమకూర్చడం కోసం ప్రయత్నాలు మొదలయ్యాయి. నూతన భవనాలు నిర్మించి మౌలిక వసతులు, ఉపకరణాలు సమకూర్చి నూతన కోర్సులు ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు.

ఒక్కో కేంద్రానికి రూ.4.5 కోట్లు

కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ విధానం విజయవంతంగా అమలుకావడంతో తెలంగాణలోనూ ప్రవేశ పెట్టాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. టాటా గ్రూపుతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో ఉన్న మహబూబాబాద్‌, ఏటూరునాగారం, భూపాలపల్లి, జనగామ, కాజీపేట, వరంగల్‌ ములుగు రోడ్డులోని రెండు సెంటర్లను రెండు విడతల్లో ఎంపిక చేశారు. దీంతో ఆరు ప్రభుత్వ ఐటీఐలు మరింతగా అభివృద్ధి చెందనున్నాయి. టీటీఎల్‌ ఒక్కో కళాశాలకు రూ.4.5 కోట్లు మంజూరు చేసింది. వీటితో నూతన కోర్సులకు అనుగుణంగా భవనాలను నిర్మిస్తారు. ప్రయోగశాలలను మరింతగా పటిష్టం చేస్తారు. కళాశాలకు అవసరమైన పరికరాలు, సాంకేతిక నిపుణులను నియమించి విద్యార్థులకు ప్రయోగాత్మకంగా ఉపాధి కల్పించేలా విద్యనందించనున్నారు.


కాజీపేటలోని ఐటీఐ కళాశాల

నిబంధనలు ఇలా..

మొదటి, రెండు విడతల్లో ఎంపికైన కళాశాలలు 10వేల చదరపు అడుగుల స్థలం చూపించాలి. విద్యుత్‌, తాగునీటి సౌకర్యం సమకూర్చాలి. టీటీఎల్‌ నిధులతో సంస్థ సూచనలకు అనుగుణంగా భవనాలు నిర్మించాల్సి ఉంటుంది. ఐదేళ్ల పాటు ఇందుకు అవసరమైన నిర్వహణ ఖర్చులను సంస్థనే భరిస్తుంది.

నూతన కోర్సులు ఇవే..
- కంప్యూటర్‌ ఎయిడెడ్‌ మ్యానుఫ్యాక్చరింగ్‌ ప్రోగ్రామర్‌.
- డ్రోన్‌ పైలట్‌ (జూనియర్‌)
- ఇండస్ట్రియల్‌ రోబోటిక్స్‌ అండ్‌ డిజిటల్‌ మ్యానుఫ్యాక్చరింగ్‌.
- ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ
- మల్టీమీడియా, యానిమేషన్‌ అండ్‌ స్పెషల్‌ ఎఫెక్ట్స్‌

బోధనలో వినూత్న మార్పులు..

టీటీఎల్‌ వారు సుమారు 26 రకాల అధునాతన కోర్సులను ఆయా కళాశాలల్లో ప్రవేశ పెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. ఒక్కో కోర్సుకు 20 సీట్ల చొప్పున మొత్తం 100 సీట్లు మంజూరు చేస్తారు. దీంతో ఇప్పటికే ఉన్న వాటికన్నా సీట్లు పెరగడంతో కళాశాలలు మరింత బలోపేతమయ్యే అవకాశం ఉంది. ఒక్కో కళాశాలలో కనీసం 5కొత్త కోర్సులను అమలు చేయనున్నారు. స్థానిక ప్రాంతాల్లోని పరిశ్రమల అవసరాలు, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కోర్సులకు రూపకల్పన చేశారు. కృత్రిమ మేధ, కంప్యూటర్‌ సైన్స్‌ వంటి కోర్సులకు ఎక్కువగా అవకాశం కల్పించనున్నారు. వీటిలో 6నెలల నుంచి ఏడాది స్వల్ప కాలిక కోర్సులు, 2సంవత్సరాల కోర్సులు అందుబాటులో ఉంటాయి.

ఉపాధికి అవకాశాలు..

నూతనంగా ఐటీఐ కోర్సుల్లో నిరుద్యోగ సమస్య పెరుగకుండా యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కోర్సులు తీర్చిదిద్దనున్నారు. కళాశాలలో ప్రవేశాలకు ఎలాంటి వయోపరిమితి లేదు. పదో తరగతి కనీస ఉత్తీర్ణత ఉండాలి. చాలా మంది చదువు మానేసి ఇతర పనులు చేసుకునే వారికి శిక్షణ పూర్తి చేసిన అనంతరం ఉపాధి కల్పిస్తారు. దీంతో నిరుద్యోగ సమస్య తీరే అవకాశం ఉంటుంది.

యువతకు ఐటీఐల్లో మంచి అవకాశాలు



నిరుద్యోగ సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం యువతకు నూతన కోర్సులతో భవిష్యత్‌ కల్పించడానికి నిర్ణయించింది. కాజీపేట ఐటీఐకి ఈ అవకాశం దక్కింది. కళాశాలకు అవసరమైన స్థలం సేకరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

– కె.అశోక్‌ కుమార్‌, ప్రిన్సిపాల్‌, కాజీపేట ఐటీఐ

పోలింగ్‌ నిబంధనలు పాటించాల్సిందే..



కాజీపేట: పోలింగ్‌ సమయంలో పోలింగ్‌ కేంద్రంలోకి ఎవరిని అనుమతించాలి? ఎవరిని అనుమతించొద్దనే విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలు విధించింది. ఎంతటి వారైనా ఈ నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఒకవేళ నిబంధలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఆ నిబంధనలు ఏంటో ఓసారి చూద్దాం..

పోలింగ్‌ కేంద్రంలోకి అనుమతించేది వీరినే..
- ప్రతి అభ్యర్థి, అభ్యర్థికి చెందిన ఒక ఎన్నికల ఏజెంట్‌,ఒక పోలింగ్‌ ఏజెంట్‌.
- ఎన్నికల విధులపై వచ్చే ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల సంఘం నియమించిన ఎన్నికల పరిశీలకులు.
- ఎన్నికల సంఘం గుర్తించిన సూక్ష్మ పరిశీలకులు, వీడియోగ్రాఫర్లు, ఫొటోగ్రాఫర్లు, సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ సిబ్బంది.
- అంగవైకల్యం, అంధ ఓటరుకు సహాయకంగా వచ్చే వ్యక్తులు
- ఎన్నికల సంఘం అనుమతించిన మీడియా ప్రతినిధులు.

వీరికి ప్రవేశం లేదు..
- పబ్లిక్‌ సర్వెంట్లుగా విధులపై వచ్చే పోలీసులను శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు మాత్రమే పోలింగ్‌ బూత్‌ల్లోకి అనుమతిస్తారు.
- జెడ్‌ప్లస్‌ కేటగిరీ ప్రొటెక్టీ తప్ప ఓటరు వెనుక వచ్చే సెక్యూరిటీ సిబ్బంది, పోటీచేసే అభ్యర్థి వెనుక ఉండే భద్రతా అధికారులు పోలింగ్‌ కేంద్రాల్లోకి ప్రవేశించొద్దు. జెడ్‌ప్లస్‌ ప్రొటెక్టీతో మఫ్టీలో ఉండే భద్రతా సిబ్బందిని అనుమతిస్తారు.
- మంత్రులు అభ్యర్థులుగా ఉన్నప్పుడు కూడా వారి వెంట భద్రతా సిబ్బంది పోలింగ్‌ కేంద్రంలోకి రావొద్దు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్‌ 2024



మట్టి తవ్వుతూ.. ఓట్లు అడుగుతూ!

ఖానాపురం : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా రాజకీయ పార్టీలు విస్తృత ప్రచారం చేస్తున్నాయి. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్‌ మహబూబాబాద్‌ ఎంపీ అభ్యర్థి మాలోత్‌ కవిత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గురువారం ఖానాపురం మండలం బుధరావుపేటలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లారు. ఈ సందర్భంగా మట్టి తవ్వుతూ కూలీలను ఓట్లు అభ్యర్థించారు.

అక్రమ కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటాం

- బీఆర్‌ఎస్‌ పార్టీ లీగల్‌ సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడు భరత్‌కుమార్‌


మాట్లాడుతున్న భరత్‌ కుమార్‌

హన్మకొండ: అక్రమ కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటామని, పార్టీని కాపాడుకోవడంలో లీగల్‌ టీం తోడ్పాటునందిస్తుందని బీఆర్‌ఎస్‌ పార్టీ లీగల్‌ సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడు సోమ భరత్‌ కుమార్‌ అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్‌ హనుమకొండ జిల్లా కార్యాలయంలో లీగల్‌ సెల్‌ సమావేశం న్యాయవాది జనార్దన్‌ గౌడ్‌ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సోమ భరత్‌ కుమార్‌ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ కోసం కొట్లాడిన అనేక సంఘాల్లో లాయర్ల జేఏసీ అగ్రస్థానంలో ఉందన్నారు. ఉద్యమ సమయంలో స్వరాష్ట్ర సాధన కోసం ఢిల్లీలో సైతం పోరాడిన చరిత్ర న్యాయవాదులదన్నారు. ఉద్యమ సమయంలో ఉద్యమకారులపై నమోదైన కేసులు, జైలు శిక్షలపై లాయర్లు సొంత ఖర్చుతో బెయిల్‌ ఇప్పించారని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి సేవలందించే అడ్వకేట్లకు రానున్న రోజుల్లో భవిష్యత్‌ ఉంటుందన్నారు. హనుమకొండ, వరంగల్‌ జిల్లా కమిటీల ఏర్పాటు రాష్ట్ర వ్యాప్తంగా లీగల్‌ సెల్‌ బలోపేతానికి ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. బీఆర్‌ఎస్‌ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌ భాస్కర్‌ మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ పార్టీ హనుమకొండ, వరంగల్‌ జిల్లాల లీగల్‌ సెల్‌ నూతన కమిటీ ఏర్పాటు హర్షణీయమన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో ఆదుకునేందుకు ముందుకు వచ్చిన అడ్వకేట్లకు అభినందనలు తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌ పార్టీ వరంగల్‌ పార్లమెంట్‌ అభ్యర్థి ఎం.సుధీర్‌ కుమార్‌, కుడా మాజీ చైర్మన్లు సుందర్‌ రాజ్‌ యాదవ్‌, మర్రి యాదవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆ మృతదేహం సుష్మితది కాదు..

- ధ్రువీకరించిన కుటుంబ సభ్యులు

హసన్‌పర్తి : ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌ జిల్లా టెక్మెట్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందింది తిక్క సుష్మిత అలియాస్‌ చైతన్య అలియాస్‌ చైతు కాదని కుటుంబీకులు తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో సుష్మిత మృతి చెందినట్లు పోలీస్‌ వర్గాలు సమాచారం మేరకు కుటుంబీకులు బుధవారం రాత్రి సూదన్‌పల్లి నుంచి ఛత్తీస్‌గఢ్‌కు పయనమయ్యారు. గురువారం ఉదయం 10గంటలకు ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ మార్చురీలో భద్రపరిచిన మృతదేహాన్ని పరిశీలించారు. ఆ మృతదేహం సుష్మితది కాదని ధ్రువీకరించారు. అనంతరం వరంగల్‌కు తిరుగుపయనమయ్యారు.

అగ్ని ప్రమాదంలో రైతు మృతి

మడికొండ: అగ్ని ప్రమాదంలో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మడికొండ శివారులో జరిగింది. మడికొండ ఎస్‌హెచ్‌ఓ ప్రతాప్‌ కథనం ప్రకారం.. ధర్మసాగర్‌ మండలం నర్సింగరావుపల్లి గ్రామానికి చెందిన దయ్యాల కుమారస్వామి(55) గురువారం ఉదయం మడికొండ శివారులోని తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. అక్కడ ఉన్న పత్తి పొరకకు నిప్పు పెట్టాడు. గాలికి మంటలు చెలరేగి పక్కనే ఉన్న మరో రైతుకు చెందిన గడ్డివాముకు అంటుకున్నాయి. భయాందోళనకు గురైన కుమారస్వామి మంటలను ఆర్పే ప్రయత్నంలో అతడికి అంటుకున్నాయి. దీంతో శరీరం తీవ్రంగా కాలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య దయ్యాల రమ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించినట్లు ఎస్‌హెచ్‌ఓ ప్రతాప్‌ తెలిపారు.

ఫిర్యాదులకు పరిశీలకులను సంప్రదించాలి

- ఎన్నికల అధికారి, కలెక్టర్‌ ప్రావీణ్య

కాళోజీ సెంటర్‌ : ఎన్నికల్లో ఫిర్యాదులు, సలహాలు, సూచనల కోసం సాధారణ పరిశీలకులను సంప్రదించాలని వరంగల్‌ పార్లమెంట్‌ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి, కలెక్టర్‌ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకురాలు బండారి స్వాగత్‌ రణవీర్‌ చంద్‌ మొబైల్‌ నంబర్‌ 8247524267కు లేదా ఎన్‌ఐటీ అబ్దుల్‌ కలాం గెస్ట్‌ హౌస్‌ నంబర్‌ కె7లో రోజూ ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య (ప్రభుత్వ సెలవులో మినహా) నేరుగా కూడా కలవొచ్చని తెలిపారు. వరంగల్‌(ఎస్సీ) పార్లమెంట్‌ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించిన ఫిర్యాదులు, సలహాలు, సూచనల కోసం సాధారణ పరిశీలకులను సంప్రదించాలన్నారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పరిశీలకులు జిల్లా కేంద్రంలో ఉండి సంబంధిత అంశాలను పరిశీలిస్తారని కలెక్టర్‌ తెలిపారు.

రూ. 2.38 లక్షల నగదు స్వాధీనం


నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్‌ రహదారిలోని దాసన్నగూడెం క్రాస్‌, జాతీయ రహదారిలోని కోమళ్ల టోల్‌ ప్లాజా వద్ద గురువారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 2,38,500 నగదు స్వాధీనం చేసుకుని సీజ్‌ చేశారు. దాసన్నగూడెం క్రాస్‌ వద్ద సోమయ్యకుంట తండాకు చెందిన కెతావత్‌ బాబురావు వద్ద రూ. 1,80,000, టోల్‌ప్లాజా వద్ద ధర్మసాగర్‌ మండలం ఎలుకుర్తికి చెందిన కేతిరి ఉప్పలయ్య వద్ద రూ. 58,500 నగదు స్వాధీనం చేసుకుని సీజ్‌ చేసినట్లు ఎస్సై నరేష్‌ తెలిపారు.

డబ్బు కోసం సూసైడ్‌ నోట్‌ నాటకం

- పోలీసులను బ్లాక్‌ మెయిల్‌ చేసిన ప్రబుద్ధుడు
- శ్యాంరావు ప్రశాంత్‌కుమార్‌ ఆచూకీ లభ్యం
- తల్లిదండ్రులకు అప్పగింత


ప్రశాంత్‌కుమార్‌ను కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

హసన్‌పర్తి : పోలీసులను బ్లాక్‌మెయిల్‌ చేస్తే అప్పుగా ఇచ్చిన డబ్బు వస్తుందని భావించిన శ్యాంరావు ప్రశాంత్‌కుమార్‌ సూసైడ్‌ నోట్‌ నాటకమాడినట్లు సీఐ సురేష్‌ గురువారం తెలిపారు. తన వద్ద అప్పుగా తీసుకున్న డబ్బు ఇప్పించాలని ఫిర్యాదు చేస్తే పోలీసులు తనను అరెస్ట్‌ చేసి తహసీల్దార్‌ ఎదుట హాజరు పరిచినందుకు ప్రశాంత్‌కుమార్‌ సూసైడ్‌ నోట్‌ రాసి అదృశ్యమైన విషయం తెలిసిందే. సీఐ, ఎస్సైతో పాటు మరో నలుగురు కానిస్టేబుళ్లు తనను వేధింపులకు గురిచేసినట్లు ఆ నోట్‌లో ప్రస్తావించాడు. ఈ విషయమై బాధితుడి భార్య నగర పోలీస్‌ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో శ్యాంరావు ప్రశాంత్‌కుమార్‌ అదృశ్యమైనట్లు హసన్‌పర్తి పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ప్రశాంత్‌కుమార్‌ ఫోన్‌ సిగ్నల్స్‌ను గుర్తించారు. హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలుసుకున్నారు. అక్కడికి వెళ్లి హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. అప్పుగా ఇచ్చిన డబ్బును పోలీసుల ద్వారా వసూలుచేయాలని భావించిన ప్రశాంత్‌కుమార్‌ ఈ నాటమాడినట్లు సీఐ తెలిపారు. దీనికి అతడి భార్య పూర్తిగా సహకరించినట్లు చెప్పారు.

కాంట్రాక్టు అసిస్టెంట్‌ ప్రొఫెసర్లకు నోటీసులు

కేయూ క్యాంపస్‌: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారనే ఆరోపణలపై కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ ఆచార్య మల్లారెడ్డి ముగ్గురు కాంట్రాక్టు అసిస్టెంట్‌ ప్రొఫెసర్లకు ఈనెల 1న షోకాజ్‌ నోటీసులు జారీచేశారు. యూనివర్సిటీ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాలలో ఎకనామిక్స్‌ విభాగంలో కాంట్రాక్టు అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌కుమార్‌లోథ్‌, జువాలజీ విభాగంలో కాంట్రాక్టు అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న లక్ష్మారెడ్డి, కాకతీయ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్‌ కళాశాలలో కాంట్రాక్టు అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆర్‌డీ ప్రసాద్‌కు రిజిస్ట్రార్‌ నోటీసులు జారీచేశారు. కేయూ పరిధిలో పనిచేస్తున్న ఈ ముగ్గురు గతనెల(ఏప్రిల్‌) 24న వరంగల్‌ పార్లమెంట్‌ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కడియం కావ్యను కలిసి తమ మద్దతు తెలిపారు. దీంతో ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనేనని వారిపై చర్యలు తీసుకోవాలని శైలేంద్ర కుమార్‌ అనే వ్యక్తి జిల్లా కలెక్టర్‌, జిల్లా ఎన్నికల అధికారి సిక్తా పట్నాయక్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో ఏఆర్‌ఓ, ఆర్‌డీఓ హనుమకొండ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలతో యూనివర్సిటీ అధికారులకు లేఖ అందడంతో రిజిస్ట్రార్‌ మల్లారెడ్డి వారికి షోకాజ్‌నోటీసులు జారీచేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. వివరణ ఇవ్వడంలో విఫలమైతే విశ్వవిద్యాలయం పరిపాలనాధికారులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని రిజిస్ట్రార్‌ మల్లారెడ్డి పేర్కొన్నారు.

భగీరథ ప్రయత్నం..

- 60 గుంటల పొలం.. 300 ఫీట్ల లోతు బావి
- సాగునీటి కోసం గిరిజన రైతుల పోరాటం


పూడిక తీస్తున్న గిరిజన రైతులు


తమ కష్టాలను వెల్లడిస్తున్న మహిళా రైతులు పోరిక బాలమ్మ, తేజావత్‌ సరోజన


భారీ లోతులో ఏర్పాటు చేసుకున్న బావి

నర్సంపేట: ఆ ఇద్దరి గిరిజన మహిళా రైతులకు ఉన్న కొద్దిపాటి భూమికి ఒకటే వ్యవసాయ బావి. సరిపోను నీరు లేక ఏటా నష్టపోతూ వస్తున్నారు. ఈసారి సాగు చేసిన మొక్కజొన్న పంట కూడా నష్టపోయారు. బావిలో పూడిక చేపట్టి వచ్చే ఏడాదికి నీరు సమకూర్చుకోవాలనుకున్నారు. బావి తవ్వుతూ భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. వరంగల్‌ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని గుండ్లపహాడ్‌తండాకు చెందిన పోరిక బాలమ్మ, తేజావత్‌ సరోజనలకు చెరొక 30గుంటల వ్యవసాయ భూమి ఉంది. పంటలకు పూర్తిస్థాయి నీరందించాలంటే బావి లోతు పెంచాలని నిర్ణయించారు. దీంతో పనులు చేపట్టారు. పూడిక తీసే క్రేన్‌కు రోజుకు రూ.2వేలు, ఆరుగురు కూలీలకు రూ.3వేల చొప్పున రోజుకు రూ.5వేలు చెల్లిస్తూ భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే 300 ఫీట్ల లోతు బావిని తవ్వామని, నీరు పడే వరకూ ప్రయత్నం చేస్తామని 'సాక్షి'తో తెలిపారు. వారి భగీరథ ప్రయత్నం విజయవంతం కావాలని ఆశిద్దాం.

రైతుల అవసరాలు తీర్చే ఆన్‌లైన్‌ ప్లాట్‌ఫాం

- నాబార్డు సీజీఎం మణికుమార్‌


నాబార్డు బృందంతో డీసీసీబీ చైర్మన్‌ రవీందర్‌ రావు

హన్మకొండ: రైతుల వ్యవసాయ అవసరాలు తీర్చడానికి ఆన్‌లైన్‌ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసినట్లు నాబార్డు సీజీఎం మణికుమార్‌ తెలిపారు. నాబార్డు ప్రవేశ పెట్టిన 'ఫాం రైజీవన్‌' కార్యక్రమంలో భాగంగా గురువారం నాబార్డు వారి స్ట్రాటజిక్‌ ప్లానింగ్‌, అండ్‌ ప్రొడక్ట్‌ ఇన్నోవేషన్‌ డిపార్ట్‌మెంట్‌కు చెందిన నాబార్డు అధికారులు, విదేశీయులతో కూడిన 18మంది ప్రతినిధుల బృందం ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో పర్యటించింది. ముందుగా బృందం తొర్రూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించి సంఘం ద్వారా జరుగుతున్న వ్యాపారాలను తెలుసుకుంది. అనంతరం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్‌ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాబార్డు సీజీఎం మణికుమార్‌ మాట్లాడారు. రైతులకు వ్యవసాయం చేయడానికి అవసరమయ్యే అన్ని రకాల సదుపాయాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పెద్ద మొత్తంలో సంఘం కొనుగోలు చేసి తక్కువ ధరకు అందించడం 'ఫాం రైజీవన్‌' ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 'ఫాం రైజ్‌ వన్‌' ఐదు కంపెనీలు టెస్కాబ్‌, రాబో బ్యాంక్‌, బేయర్‌ కంపెనీ, ఐ2వీ కంపెనీ, పీఏసీఎస్‌ల సమన్వయంతో పని చేస్తోందన్నారు. కొనుగోలుదారులు, సంఘాల మధ్య అవసరమైన లావాదేవీలు, సమాచారం పంచుకోవడానికి ఆన్‌లైన్‌ ప్లాట్‌ ఫాం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రెడిట్‌ లిమిట్‌ దరఖాస్తు తయారీ కోసం ఐ2వీ కన్సల్టెన్సీ సహకారం అందిస్తుందన్నారు. సొసైటీ గోడౌన్లలో నిల్వ చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ఆన్‌లైన్‌ ప్లాట్‌ఫామ్‌లో కొనుగోలుదారు వివరాలు చేరుస్తారన్నారు. డీసీసీబీ చైర్మన్‌ రవీందర్‌రావు మాట్లాడుతూ.. రైతుల నుంచి పంట ఉత్పత్తులను సొసైటీలు కొనుగోలు చేసి గోడౌన్‌లో నిల్వచేస్తాయన్నారు. 15రోజుల లోపు రైతులకు చెల్లింపులు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాబార్డు డీజీఎంలు శశిరేఖ, మోహన్‌ రాజ్‌, సాయి శ్రీనివాస్‌, జనరల్‌ మేనేజర్‌ మిర్నాల్‌ రాజన్‌, వరంగల్‌ నాబార్డ్‌ డీడీఎం చంద్రశేఖర్‌, రవి, అధికారులు షరీఫ్‌, నిర్మల, బ్రజేష్‌, బోర్న్‌, ప్రియా, హరిత రాజముర్గన్‌, ఆంజనేయులు, శ్రీనివాస్‌, ఎండీ వజీర్‌ సుల్తాన్‌, బి.శ్రీధర్‌, కురువా నాయక్‌, రోహిణి, రాజశేఖర్‌, నవీన్‌, రాధిక పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
వరంగల్
శుక్రవారం ॥ 3-5-2024

ఫ్యాషన్

వేసవి వేడిమిని తట్టుకోవాలి,
కంఫర్ట్‌గా ఉండాలి
అదే టైమ్‌లో స్టైలిష్‌గానూ కనిపించాలి.
కాటన్ కుర్తీ పైకి బాందినీ,
చందేరీ, ఇకత్, సిల్క్ ఓవర్ కోట్లు
ఇప్పుడు బెస్ట్ ఛాయిస్‌గా ఉంటున్నాయి.
బోహోస్టైల్‌ని తలపిస్తూ, సమ్మర్ స్పెషల్‌గా ఉండే
ఈ స్టైల్ ఏ సందర్భానికైనా బాగా నప్పుతుంది.

కలర్‌ఫుల్‌గా.. కంఫర్టబుల్‌గా..



సంప్రదాయ వేడుకల్లో షిమ్మరీ లుక్ ఉండే లాంగ్ ఫ్రాక్స్, వాటి మీదకు సిల్క్ డిజైనర్ లాంగ్ ఓవర్ కోట్స్ ప్రత్యేకతను చూపుతాయి.



లాంగ్ ఫ్రాక్ లేదా లాంగ్ కుర్తీ ఈ స్టైల్‌కి ఎంచుకోవచ్చు. సాకర్యాన్ని బట్టి స్లీవ్స్ లేదా స్లీవ్‌లెస్ టాప్స్‌ని సెలక్ట్ చేసుకోవాలి. కాటన్ కుర్తీ ఏ ఫ్యాబ్రిక్ అయినా ఫ్లోరల్స్‌లో లేదా భిన్నమైన ప్రింట్లు ఉన్న ఓవర్ కోట్స్ బాగా నప్పుతాయి. ఈ స్టైల్ డ్రెస్సింగ్ బోహో లుక్‌తో అట్రాక్ట్ చేస్తుంది. ఈ కాలానికి తగినట్టుగా ఫ్యాషన్ జ్యువెలరీ దీనికి సరైన ఎంపిక అవుతుంది.



ప్లెయిన్ డ్రెస్ ధరించినప్పుడు పూర్తి కాంట్రాస్ట్ ఓవర్ కోట్ వేసుకుంటే ఎక్కడ ఉన్నా స్పెషల్‌గా కనిపిస్తారు.

కాటన్ కుర్తీ–పైజామా మీదకు ఫ్లోరల్ ప్రింట్ ఉన్న కాటన్ ఓవర్‌కోట్‌ను ధరించవచ్చు. దుపట్టా అవసరం లేని ఈ స్టైల్ క్యాజువల్ వేర్‌గానూ, పార్టీవేర్‌గానూ సెట్ అవుతుంది.



లాంగ్ ఫ్రాక్‌కి అటాచ్ చేసినట్టుగా ఉండే ఫ్రాక్ స్టైల్ ఓవర్ కోట్ పార్టీలో స్టైలిష్ లుక్‌తో వెలిగిపోతుంది.



కాటన్ లాంగ్ కుర్తీకి ఇక్కత్ లాంగ్ ఓవర్ కోట్ ధరిస్తే ఉక్కబోతను, స్టైల్‌ని రెండింటినీ బ్యాలెన్స్ చేయవచ్చు.



సింపుల్ అండ్ గ్రేస్‌గా కనిపించే లుక్ టాప్ అండ్ బాటమ్‌కి ఫ్లోరల్ ఓవర్ లాంగ్ కోట్ సూపర్ స్టైలిష్ లుక్‌గా కనిపిస్తుంది.



సిల్క్ టాప్స్ అయినా ఈవెనింగ్ టైమ్‌కి ఓకే అనుకున్నవారు అదే కాంబినేషన్‌లో వచ్చే సిల్క్ ఓవర్ కోట్ ప్రత్యేకంగా కనిపిస్తుంది.



ఓవర్‌కోట్‌లా అనిపించే లాంగ్ ఫ్రాక్ డ్రెస్‌ను కూడా ఈ స్టైల్‌కి ఎంపిక చేసుకోవచ్చు. సమ్మర్‌లో ఈవెనింగ్ పార్టీకి స్పెషల్ అట్రాక్షన్‌గా వెలిగిపోవచ్చు.

ఎక్స్‌పర్ట్

ఇప్పుడు డీప్‌ఫేక్‌ల వివాదం నడుస్తోంది.
ఎన్నికల సమయంలోనే కాదు
సర్వ కాలాల్లోనూ డీప్‌ఫేక్ వీడియోలు
ప్రముఖులకు పెద్ద సవాలు.
ఇక స్త్రీలకు ఇవి పీడగా పరిణమించాయి.
వీటి గుట్టుమట్లు ఏమిటో
ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నీడలో
ఎలా జాగ్రత్తగా జీవించాలో తెలియచేస్తోంది
ఆ రంగంలో నిపుణురాలు మధుమితా ముర్గియా.

డీప్‌ఫేక్ గుట్టు ఆమెకు తెలుసు



మధుమితా ముర్గియా

‘ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో తయారయ్యే డీప్‌ఫేక్ వీడియోలు ఎంత కచ్చితంగా ఉంటాయంటే నిజమైనవా, అబద్ధమైనవా కనిపెట్టడం బ్రహ్మతరం కూడా కాదు. డీప్‌ఫేక్ వీడియోలు ఎవరినీ వదలవు. ప్రముఖులు వీటివల్ల అభాసుపాలు కావచ్చు. కాని మామూలు స్త్రీలు దీని బాధితులవుతారు. డీప్‌ఫేక్‌లో వీడియోను మార్ఫింగ్ చేయొచ్చు. అంటే మీరు పార్క్‌లో నడుస్తుంటే బీచ్‌లో నడుస్తున్నట్టుగా మార్చవచ్చు. దుస్తులతో ఉంటే దుస్తులు లేకుండా చేయొచ్చు. మరో పద్ధతి ‘ఇమేజ్ క్రియేటింగ్’. అంటే మీ వీడియో ఏమీ లేకపోయినా మీ ఇమేజ్‌ను పూర్తిగా సృష్టించి దానిని కావల్సినట్టుగా ఆడించవచ్చు. డీప్‌ఫేక్‌లో ఏ స్త్రీనైనా పార్నోగ్రఫీ వీడియోలో ఉన్నట్టుగా భ్రమింపచేయవచ్చు. అదొక్కటే కాదు నిషేధిత సమయాల్లో నిషేధిత ప్రదేశాల్లో సంఘవ్యతిరేక శక్తుల మధ్య ఉన్నట్టుగా కూడా మిమ్మల్ని చూపొచ్చు. దీనికి అంతం లేదు. రాజకీయ ఉపన్యాసాలను డీప్‌ఫేక్‌తో మార్చి ఇబ్బంది పెట్టడం చాలా సులువు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ప్రయోజనాలు ఎన్ని ఉన్నాయో ప్రమాదాలు అన్ని ఉన్నాయి. ఈ టెక్నాలజీ నాశనం అయ్యేది కాదు. మరింత పెరిగేది. దీని పట్ల ఎరుకతో ఉండటమే చేయగలిగింది’ అంటుంది మధుమితా ముర్గియా. ఆమె ఏ.ఐ. ఎక్స్‌పర్ట్.

బ్రిటిష్ ఇండియన్

ముంబైలో మూలాలు కలిగిన మధుమితా ముర్గియా లండన్‌లో పెరిగింది. అక్కడే చదువుకుంది. బయోలజిస్ట్‌గా, ఇమ్యూనాలజిస్ట్‌గా పని చేస్తూ టెక్ ఇండస్ట్రీ గురించి ఆసక్తి పెంచుకుంది. లండన్‌కు చెందిన ఫైనాన్షియల్ టైమ్స్ పత్రికకు ఏ.ఐ. ఎడిటర్‌గా పని చేస్తూ వ్యాపార ప్రయోజనాల కోసం మన డేటా ఎలా వాడబడుతున్నదో, చేతిలోని ఫోన్ వల్ల మన ప్రైవసీకి ఎలా భంగం కలుగుతున్నదో ఆమె ప్రపంచానికి తెలియచేస్తూ వస్తోంది. అంతేకాదు ఈ విషయాల గురించి ఆమె రాసిన తాజా పుస్తకం ‘కోడ్ డిపెండెంట్’కు మంచి ప్రశంసలు వస్తున్నాయి. 2024 సంవత్సరానికి ఆమె బెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ జర్నలిస్ట్‌గా బ్రిటిష్ ప్రెస్ అవార్డ్‌ను గెలుచుకుంది.

ఏ.ఐ.తో మంచి: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో మూడు రంగాల్లో మంచి జరుగుతున్నదని అంటుంది మధుమిత. ‘ఆరోగ్య రంగంలో రిపోర్ట్‌ల ఆధారంగా పేషెంట్ వ్యాధిని ఏ.ఐ.తో గొప్ప స్పెషలిస్ట్ స్థాయిలో అంచనా కట్టొచ్చు. దీనివల్ల డాక్టర్ అపాయింట్‌మెంట్ కోసం వేచి ఉండే బాధ తప్పింది. ఫార్మాసూటికల్ రంగంలో కూడా ఏ.ఐ సేవలు బాగా ఉపయోగపడతాయి. ఇక సైన్స్ రంగంలో చేయాల్సిన పరిశోధనలు సులువవుతాయి. విద్యా రంగంలో విద్యార్థుల రీసెర్చ్ కోసం ఏ.ఐ. ఉపయోగపడుతుంది. నేర పరిశోధనలో ఏ.ఐ.ని వాడి నేరస్తులను పట్టుకుంటున్నారు. ఇవన్నీ మంచి విషయాలే’ అంటుందామె.

చెడు ఎంతో ఉంది:

‘ఏ.ఐ. వల్ల రాబోయే ఐదేళ్లలో ఫొటోగ్రాఫర్లు అనేవాళ్లే లేకుండా పోవచ్చు. ఏ.ఐ. సహాయంతో ఎవరైనా సరే గొప్ప ఫొటోలు తీయవచ్చు. రచయితల బదులు ఏ.ఐ.తో కథలు రాయవచ్చు. కంప్యూటర్ల మీద జరగాల్సిన చాలా పనులు మనుషులు లేకుండానే జరిగే స్థితి రావచ్చు. దీనివల్ల లాభాలు సంస్థలకు వచ్చిన మనుషుల ఉనికి అంటే ఉద్యోగుల ఉనికి ఆందోళనలో పడుతుంది. చేతిలో ఫోన్ ఉంటే ఏ.ఐ. ద్వారా మీ ప్రతి కదలికను గుర్తించవచ్చు. మీరు ఇంట్లో ఉన్నా సురక్షితం కాదు. మీరు యాప్స్ ద్వారా కొనే వస్తువులను, మీరు వెళ్లే ఆస్పత్రులను, మీరు కొనే మందులను, వెళ్లే రెస్టరెంట్లను బట్టి రాబోయే కాలంలో మీ జీవితం ఎలా ఉంటుందో ఊహించి మీ చేత ఏమేమి కొనిపించాలో మిమ్మల్ని ఎలా వినియోగదారునిగా మార్చాలో ఏ.ఐ. ఆయా కంపెనీలకు చెబుతుంది. గతంలో ఒక టెక్నాలజీని అనేక ఏళ్లు పరీక్షించి జనానికి మేలు కలిగే విధంగా వదిలేవారు. ఏ.ఐ. లాంటివి మంచి చెడ్డలు పరీక్షించకనే వదిలారు. అవి రోజు రోజుకూ శక్తి పుంజుకుంటున్నాయి. ఏ.ఐ. నుంచి తప్పించుకోలేము. అలాగని మరీ అంత భయం కూడా అక్కర్లేదు. మానవశక్తి, మానవ జ్ఞానం కృత్రిమ యాంత్రిక జ్ఞానం కంటే ఎప్పుడూ గొప్పవే’ అంటోంది మధుమిత.

వంటిల్లు

చల్లకూరలు

మే నెల వచ్చేసింది... ఎండలు మండుతున్నాయి.
భోజనం చేయాలంటే చెమటలు పడుతున్నాయి.
కూరలను చూస్తేనే ఆకలి పోయి దాహం వేస్తోంది.
నేరుగా మజ్జిగలోకి వెళ్లాలనిపించేంత దాహం అది.
అందుకే పెరుగుతోనే కూరలు చేసుకుందాం.
ఇవన్నీ నాలుకకు హితవుగా ఉంటాయి.
తిన్న తర్వాత పొట్టను చల్లగా ఉంచుతాయి.

దహీ బైంగాన్



కావలసినవి: వంకాయ – 1 (మీడియం సైజు); నూనె – టేబుల్ స్పూన్ (వంటకు ఉపయోగించే నూనె ఏదైనా) ; ఆవనూనె – టేబుల్ స్పూన్ (పోపు కోసం) ; యాలకులు – 2 ; లవంగాలు – 2 ; పెరుగు – పావు లీటరు (చిలకాలి).
గ్రేవీ కోసం: మెంతిపిండి – టేబుల్ స్పూన్ ;అల్లం పేస్ట్ – టేబుల్ స్పూన్ ; కశ్మీర్ మిర్చిపొడర్ – టేబుల్ స్పూన్ ; నీరు – కప్పు (పై వన్నీ కలపడానికి) ; ఇంగువ– చిటికెడు ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; పసుపు – టీ స్పూన్.
తయారీ: ● ఒక పాత్రలో కప్పు నీరు పోసి అందులో మెంతిపిండి, మిర్చిపొడర్, అల్లం పేస్టు వేసి కలపాలి ● వంకాయను మందపాటి చక్రాల్లా తరిగి ఉప్పు రాయాలి ● నూనె వేడి చేసి వంకాయ ముక్కలను వేయించి పక్కన పెట్టాలి(ఎయిర్ ఫ్రయర్ ఉంటే నూనె లేకుండా ఫ్రై చేసుకోవచ్చు) ● అదే బాణలిలో మిగిలిన నూనెలో ఆవ నూనె వేసి వేడెక్కిన తర్వాత లవంగాలు, యాలకులు, ఇంగువ వేయాలి. ఇందులో మెంతిపిండి, అల్లం, మిరప్పొడి కలిపిన మిశ్రమం, పసుపు వేసి కలిపి సన్న మంట మీద మరిగించాలి ● ఆ మిశ్రమం వేడెక్కిన తర్వాత పెరుగు వేసి గరిటెతో కలుపుతూ ఐదారు నిమిషాల పాటు మరిగించాలి. మిశ్రమం మరగడం మొదలైన తర్వాత మరో కప్పు నీటిని పోసి కలిపితే చిక్కటి గ్రేవీ తయారవుతుంది. ఇప్పుడు ఉప్పు కలిపి గ్రేవీ చిక్కదనాన్ని సరిచూసుకుని అవసరమైతే మరికొన్ని నీటిని పోసి మరగనివ్వాలి. ఇప్పుడు వేయించి పక్కన పెట్టుకున్న వంకాయ ముక్కలను వేసి కలిపి వడ్డించాలి. ఇది అన్నంలోకి రోటీకి కూడా మంచి కాంబినేషన్.

పులిస్సేరి



కావలసినవి: పెరుగు – పావు లీటరు ; పసుపు – పావు టీ స్పూన్ ; నీరు – పావు లీటరు.
కొబ్బరి పేస్టు కోసం: పచ్చి కొబ్బరి తురుము – అర కప్పు ; పచ్చిమిర్చి– 3 ; జీలకర్ర– టీ స్పూన్; నీరు – కప్పు లేదా కొబ్బరి పేస్టు చేయడానికి తగినంత.
పోపు కోసం: నూనె – 2 టేబుల్ స్పూన్‌లు (వంటకు ఉపయోగించే కొబ్బరి నూనె లేదా ఇతర వంట నూనె) ; ఆవాలు – అర టీ స్పూన్ ; కరివేపాకు – 2 రెమ్మలు ; మెంతులు– పావు టీ స్పూన్ ; ఎండుమిర్చి– 2 ; ఉల్లిపాయ ముక్కలు– పావు కప్పు ; అల్లం – అర అంగుళం ముక్క (సన్నగా తరగాలి) ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.
తయారీ: ● కొబ్బరి తురుము, పచ్చిమిర్చి, జీలకర్ర మిక్సీలో గ్రైండ్ చేయాలి. తగినంత నీటిని వేస్తూ మెత్తగా చేసుకోవాలి ● ఒక పాత్రలో పెరుగు, పసుపు, నీరు కలిపి చిలికి అందులో ఉప్పు, కొబ్బరి పేస్టు వేసి కలపాలి ● ఈ పాత్రను స్టవ్ మీద పెట్టి మీడియం మంటమీద మధ్యలో గరిటెతో కలుపుతూ వేడిచేయాలి. దీనిని ఎక్కువసేపు ఉడికించాల్సిన అవసరం లేదు. మరగడం మొదలైన వెంటనే దించేయాలి ● బాణలిలో నూనె వేడిచేసి ఆవాలు వేయాలి. అవి వేగిన తర్వాత మెంతులు, ఎండుమిర్చి, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు, అల్లం తరుగు వేసి చిన్న మంట మీద మగ్గనివ్వాలి. ఉల్లిపాయ ముక్కలు ఎర్రగా వేగిన తర్వాత పోపును ముందుగా వేడి చేసి సిద్ధంగా ఉంచిన పెరుగు– కొబ్బరి పేస్టు మిశ్రమంలో కలిపి, కొత్తిమీర చల్లి మూత పెట్టాలి. ఈ కేరళ వంట అన్నంలోకి రుచిగా ఉంటుంది.

గుజరాతీ కడీ

కావలసినవి: శనగపిండి– 4 టేబుల్ స్పూన్‌లు; అల్లం పచ్చిమిర్చి పేస్ట్– అర టేబుల్ స్పూన్ (అల్లం అంగుళం ముక్క, రెండు పచ్చిమిర్చి కలిపి గ్రైండ్ చేయాలి); తాజా పెరుగు – కప్పు ; బెల్లం లేదా చక్కెర – టేబుల్ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నీరు – రెండున్నర కప్పులు.
పోపు కోసం: నూనె – టీ స్పూన్ ; ఆవాలు – అర టీ స్పూన్ ; జీలకర్ర– అర టీ స్పూన్ ; దాల్చిన చెక్క – అంగుళం ముక్క ; లవంగాలు – 2 ; కరివేపాకు – ఒక రెమ్మ ; ఎండు మిర్చి – 2; మెంతులు – పావు టీ స్పూన్ ; ఇంగువ – చిటికెడు ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.
తయారీ: ● ఒక పాత్రలో శనగపిండి, అల్లం-పచ్చిమిర్చి పేస్ట్, పెరుగు, బెల్లం, ఉప్పు వేసి బాగా చిలకాలి ● బాణలిలో నూనె వేడిచేసి ఆవాలు వేయాలి. అవి పేలిన తర్వాత జీలకర్ర, దాల్చిన చెక్క, లవంగాలు, కరివేపాకు, ఎండుమిర్చి (విరిచి వేయాలి), మెంతులు, ఇంగువ వేసి దోరగా వేగిన తర్వాత స్టవ్ ఆపేయాలి. ఈ పోపును ముందుగా చిలికి పెట్టుకున్న పెరుగు – శనగపిండి మిశ్రమంలో వేసి కలపాలి ● ఇప్పుడు ఆ పాత్రను మీడియం మంట మీద ఉంచి మిశ్రమం అడుగుకు అంటుకోకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. మిశ్రమం మరగడం మొదలైన తర్వాత మంట తగ్గించి కలుపుతూ మాడకుండా చూసుకోవాలి. శనగపిండి పచ్చి వాసన పోయిన తర్వాత మిశ్రమం మంచి రుచికరమైన వాసన వస్తుంటుంది. అప్పుడు కొత్తిమీర చల్లి దించేయాలి ● గుజరాతీ కడీని సూప్‌లాగ భోజనానికి ముందు తాగవచ్చు. అన్నంలో కలుపుకోవచ్చు, రోటీలోకి కూడా తినవచ్చు. ఇది వేసవి, శీతాకాలాల్లో కూడా ఆరోగ్యకరమైన ఆహారం.



కుకురార్



కావలసినవి: చికెన్ – అర కేజీ ; చిక్కటి పెరుగు – 5 టేబుల్ స్పూన్‌లు ; బంగాళ దుంప – 2 (ముక్కలుగా తరగాలి) ; అల్లం వెల్లుల్లి తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు ; ఉల్లిపాయలు – 3 (తరగాలి) ; ఆవ నూనె లేదా సాధారణ వంటనూనె – 5 టేబుల్ స్పూన్‌లు ; చక్కెర – చిటికెడు ; ఉప్పు – 2 టీ స్పూన్‌లు లేదా రుచిని బట్టి ; ఎండు మిర్చి– 5 ; పచ్చిమిర్చి– 3 (నిలువుగా చీరాలి) ; పసుపు – టీ స్పూన్ ; మిరప్పొడి– 2 టీ స్పూన్‌లు ; గరం మసాలా పొడి – టీ స్పూన్ ; చికెన్ మసాలా పొడి– టీ స్పూన్ ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.
తయారీ: ● చికెన్‌ను శుభ్రంగా కడిగి ఒక పాత్రలో వేయాలి. అందులో పసుపు, చికెన్ మసాలా పొడి, మిరప్పొడి వేసి మసాలా పొడులు చికెన్ ముక్కలకు బాగా పట్టేటట్లు కలిపి 20 నిమిషాల పాటు పక్కన ఉంచాలి ● ఈ లోపు ఒక బాణలిలో నూనె వేడి చేసి అందులో ఇంగువ, చక్కెర, ఎండు మిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించి ఒక ప్లేట్‌లోకి తీసుకోవాలి. ఇవి చల్లారిన తరవాత మిక్సీలో గ్రైండ్ చేయాలి. అందులోనే పెరుగు కూడా వేసి సమంగా కలిసేటట్లు ఒకసారి తిప్పి ఒక పాత్రలోకి తీసుకుని పక్కన పెట్టాలి ● ఉల్లిపాయలు వేయించిన బాణలిలో మిగిలిన నూనెలో బంగాళాదుంప ముక్కలు వేయించి ఒక పాత్రలోకి తీసుకుని పక్కన ఉంచాలి. అదే బాణలిలో అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి వేయించి తీసి పెట్టుకోవాలి ● ఇప్పుడు మిగిలిన నూనెలో మారినేట్ చేసిన చికెన్ ముక్కలు వేసి మీడియం మంట మీద వేయించాలి. చికెన్ ముక్కలు ఎర్రగా వచ్చేవరకు వేయించి అప్పుడు ఉప్పు వేసి ముక్కలకు పట్టేటట్లు కలపాలి. చికెన్ ముక్కల నుంచి నూనె వేరవుతున్న సమయంలో బంగాళాదుంప ముక్కలను వేయాలి. ఈ రెండింటినీ కలిపి పది నిమిషాల పాటు వేయించిన తర్వాత అందులో రెండు కప్పుల నీరు పోసి కలిపి మంట పెంచి ఉడకనివ్వాలి ● చికెన్ ఉడికేటప్పుడు అందులో ముందుగా వేయించి పెట్టుకున్న అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చితోపాటు గరం మసాలా పొడి, చిలికిన పెరుగు మిశ్రమాన్ని వేయాలి. ఇవన్నీ కలిసి ఉడికిన తర్వాత చివరగా కొత్తిమీర వేసి కలిపి దించేయాలి. ఈ కుకురార్ అస్సాం వాళ్ల వంట. అన్నం, రోటీల్లోకి రుచిగా ఉంటుంది.